

వ్యవసాయ కళాశాల మంజూరుపై టీయూలో సంబరాలు

ఇందూరు, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేయడాన్ని హర్షిస్తూ తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్ కళాశాల ఎదుట శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూ పరిశోధక విద్యార్థి సంఘం అధ్యక్షుడు పుప్పాల రవి ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పుప్పాల రవి మాట్లాడుతూ.. కళాశాల మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.





ఆస్పత్రిలో కానిస్టేబుల్ ప్రమోద్ మృతదేహం, ప్రమోద్(ఫైల్)

అరెస్ట్ చేస్తున్నారని.. హతమార్చాడు..

- నగరంలో కానిస్టేబుల్ దారుణ హత్య
- సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచిన పాత నేరస్థుడు రియాజ్
- సంచలనం సృష్టించిన ఘటన

నిజామాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. పోలీసు కానిస్టేబుల్‌ను పాత నేరస్థుడు దారుణంగా హత్య చేశాడు. కత్తితో ఛాతిలో పొవడంతో కానిస్టేబుల్ ఘటన స్థలంలోనే కుప్పకూలి పోయాడు.. ఓ కేసులో నిందితుడిని అరెస్టు చేసి బైక్ పై తీసుకొస్తుండగా.. కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి నేరస్థుడు రియాజ్ పరారయ్యాడు ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టిస్తోంది.

నిజామాబాద్ నగరంలోని నాలుగో టౌన్ పరిధిలో ఉన్న వినాయక్ నగర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. నాలుగో టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్(సీసీఎస్) ప్రమోద్ హత్యకు గురయ్యాడు. నగరంలోని హస్మీ కాలనీకి చెందిన బైక్ చోరీ నిందితుడు రియాజ్‌ను పట్టుకునేందుకు సీసీఎస్ ఎస్సై విట్టల్, కానిస్టేబుల్ ప్రమోద్ వెళ్లారు. ప్రమోద్ బైకుపై రియాజ్‌ను వెనుక కూర్చోబెట్టుకొని తీసుకొస్తుండగా వెనుక నుంచి రియాజ్ ప్రమోద్ ఛాతీలో కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కాగా అతణ్ని ఎస్సై, ఇతరులు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రమోద్ మరణించాడు. అడ్డుపడిన ఎస్సై విట్టల్ పై కూడా నిందితుడు కత్తితో దాడి చేయగా ఆయన చేతికి గాయం అయింది. దాడి అనంతరం రియాజ్ తప్పించుకుని పారిపోయాడు. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో మెయిన్ రోడ్డుపైనే ఈ ఘటన జరిగింది. అదే రోడ్డులో వెళ్తున్న మోపాల్ ఎస్సై తన వాహనంలో ప్రమోద్‌ను జిల్లా ఆస్పత్రికి మార్గమధ్యంలోనే ప్రమోద్ మృతి చెందాడు. దొంగ చేతిలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన జిల్లా పోలీస్ శాఖలో విషాదం నింపింది. కానిస్టేబుల్ ప్రమోద్ ఇటీవల బదిలీలలో ట్రాఫిక్ విభాగం నుంచి సీసీఎస్‌కు బదిలీపై వచ్చాడు. 2003 బ్యాచ్‌కు చెందిన ప్రమోద్‌కు భార్య ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. రియాజ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. రియాజ్ పై పలు దొంగతనం, హత్య కేసులు, చైన్ స్నాచింగ్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అడిషనల్ ఏసీపీ బసవరెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చి కానిస్టేబుల్ మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా స్థలాన్ని నగర సీఐ శ్రీనివాసరాజు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ పరిశీలించారు.



మత్స్యశాఖలో.. బదిలీల ఆట!

జిల్లా మత్స్యశాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. ఏడీ ఇష్టారాజ్యంగా ఉద్యోగులను బదిలీ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసులు ఇస్తే కోరుకున్న చోటుకు బదిలీ చేస్తూ తనకు అనుకూలంగా ఉన్న వారిని డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయానికి రప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల పంపిణీ టెండర్ల విషయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా కలెక్టర్ టెండర్లను రద్దు చేశారు. ఈ వ్యవహారంలో చక్రం తిప్పిన జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సొంత శాఖలోనే నిబంధలనకు విరుద్ధంగా సిబ్బందిని బదిలీచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

- కాసులు ఇస్తేనే ట్రాన్స్‌ఫర్లు.. లేదంటే నిలిపివేత
- ఫీల్డ్ మెన్‌లకు కార్యాలయంలో సెక్షన్‌లు
- ఖాళీగా ఉంటున్న క్లర్క్‌లు
- ఇష్టారాజ్యంగా జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవహారశైలి

నిజామాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఆరు నెలలకొకసారి బదిలీలు జరుగుతాయి. కాసులు ఇస్తే బదిలీలు నిలిచిపోగా కాసులు ఇవ్వకపోతే బదిలీ తప్పనిసరి పరిస్థితి నెలకొంది. ఇటీవల జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల పంపిణీ టెండర్ల విషయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా కలెక్టర్ టెండర్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. టెండర్ల వ్యవహారంలో చక్రం తిప్పిన జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సొంత శాఖలోనే బదిలీల ఆట ఆడుతున్నాడు. 2024 జూలైలో ప్రభుత్వం సాధారణ బదిలీలకు అవకాశం ఇవ్వగా ఇంతకుముందు పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ సుదీర్ఘకాలంగా ఒకేచోట పని చేస్తున్న ఫీల్డ్‌మెన్‌లను బదిలీ చేశారు. ఆ సమయంలో పని చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ పదోన్నతులలో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లగా ఆ తర్వాత వచ్చిన ఏడీ బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల్లోనే మళ్లీ బదిలీ అయిన వారిని డిప్యూటేషన్లపై గతంలో పనిచేసిన స్థానాలకు వేయడం వివాదాస్పదమైంది. తనకు అనుకూలంగా ఉన్న వారిని డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయానికి తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ ఆరు నెలలకొకసారి బదిలీల పేరుతో ఫీల్డ్‌మెన్‌లను మారుస్తూ డబ్బులు దండుకోవడం ఏడీకి అలవాటుగా మారినట్లు విమర్శలు ఉన్నాయి. ఆరునెలలకొకసారి రెన్యూవల్ టైమ్ అంటూ ఏడీ ఫీల్డ్‌మెన్‌లను మారుస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మత్స్యశాఖ కార్యాలయంలో నలుగురు క్లర్క్‌లు పనిచేస్తుండగా వారికి కార్యాలయంలో ఎలాంటి సెక్షన్‌లు కేటాయించకుండా ఫీల్డ్ లెవల్‌లో పనిచేసే ఫీల్డ్‌మెన్‌లకు మాత్రం కార్యాలయంలో సెక్షన్‌లు కేటాయించడం వివాదాస్పదమవుతోంది. మత్స్యశాఖలో ఫీల్డ్‌మెన్‌లు ఫీల్డ్ లెవల్‌లో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉండగా ఏడీ తన సొంత ప్రయోజనాల కోసం ఫీల్డ్‌మెన్‌లను కార్యాలయంలో విధులు కేటాయిస్తూ సెక్షన్‌లు ఇవ్వడంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్-పోచంపాడ్, పోచంపాడ్- ఆర్మూర్..

జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఫీల్డ్ మెన్‌ల పరిస్థితి ఇష్టారాజ్యంగా మారింది. ఆర్మూర్‌లో 20ఏళ్లుగా పని చేస్తున్న ఓ ఫీల్డ్‌మెన్‌ను పోచంపాడ్‌కు బదిలీ చేయగా సదరు ఏడీ బాధ్యతలు స్వీకరించాక అతన్ని మళ్లీ ఆర్మూర్‌కు డిప్యూటేషన్ వేయడం వివాదాస్పదమవుతోంది. నిజామాబాద్‌లో 20ఏళ్లుగా పనిచేసిన ఫీల్డ్‌మెన్‌ను ఆర్మూర్‌కు బదిలీ చేయగా మళ్లీ డిప్యూ టేషన్‌పై ఏడీ కార్యా లయంలో విధులు కేటాయించడం వెనుక అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. పోచంపాడ్‌లో పనిచేస్తున్న ఫీల్డ్‌మెన్‌ను నిజామాబాద్‌కు బదిలీచేయగా మళ్లీ మూడు నెలల వ్యవధిలోనే పోచంపాడ్‌కు డిప్యూటేషన్ వేయడం శాఖలో పరిస్థితిని తెలియజేస్తోంది.

ఆర్మూర్‌లో ఆ ఫీల్డ్‌మెన్‌దే హవా...

ఆర్మూర్ మత్స్యశాఖ ఎఫ్‌డీవో కార్యాలయంలో ఫీల్డ్‌మెన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తిదే హవా కొన సాగుతోంది.



అక్కడ ఎఫ్‌డీవో స్థాయి అధికారి విధులు నిర్వహించాల్సి ఉండగా ఆ పోస్టు ఖాళీగా ఉండటంతో అక్కడ వ్యవహారాలన్నీ ఏడీకి సన్నిహితంగా ఉండే ఫీల్డ్‌మెన్ నిర్వహిస్తున్నాడు. ఆర్మూర్ ప్రాంతంలో మత్స్యశాఖ సొసైటీలు ఎక్కువగా ఉండటంతో అక్కడ రాబడి ఎక్కువగా ఉంటుందనే ఆశతో సదరు ఫీల్డ్‌మెన్‌ను ఏడీ కొన్నేళ్లుగా అక్కడే పోస్టింగ్‌లో ఉంచుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఏడీకి నచ్చిన వారు నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్లపై పనిచేస్తున్న మత్స్యశాఖపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం లేదు. కామారెడ్డికి చెందిన ఫీల్డ్‌మెన్ నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్నాడు. జిల్లాస్థాయి పోస్ట్ అయినప్పటికీ అంతర్ జిల్లా స్థాయి బదిలీలు చేసి మరీ ఏడీ ఆ పోస్టులో కామారెడ్డికి చెందిన వ్యక్తిని నియమించడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల చేపపిల్లల పంపిణీ టెండర్‌ను ఏకపక్షంగా ఒక కంపెనీకి అప్పగించే క్రమంలో కలెక్టర్ టెండర్లు రద్దు చేయగా ఇప్పుడు మత్స్యశాఖలో బదిలీల ఆటపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.



మోర్తాడ్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌వో

జిల్లాలో 26 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

- జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి శ్రీనివాస్‌రావు

మోర్తాడ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొక్కజొన్న రైతుల అభివృద్ధి కోసం, గిట్టుబాటు ధర పొందేందుకు 26 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మోర్తాడ్‌లో ఆయన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న రైతులు దళారులకు అమ్మి మోస పోకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా 26 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. క్వింటాలు మొక్క జొన్నకు 2400 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వరి పంటను రైతులు దళారులకు అమ్మవద్దని సూచించారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలు 2389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటా లుకు 2369 రూపాయలు మద్దతు ధర ఇస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలనే విక్రయించాలని అంతేకాక త్వరలోనే రైతుల ఖాతాలోకి డబ్బులు

మిగతా 8వ పేజీలో...

బాటిల్ బరి...



- రంగంలోకి ఆంధ్రా, మహారాష్ట్ర లిక్కర్ వ్యాపారులు
- నేటితో మద్యం టెండర్లకు చివరి రోజు
- భారీగా దరఖాస్తుల నమోదు
- ఆసక్తి చూపుతున్న ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల టెండర్లపై ఇతర రాష్ట్రాల వారు నజర్ పెట్టారు. టెండర్లకు ఒక రోజు మిగిలి ఉండడంతో జోరుగా దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. ఫీజు రూ.3లక్షలకు పెరిగినా వెనుకాడడం లేదు. సిండికేట్ గా మారి ఎక్కువ మొత్తంలో మద్యం దుకాణాలను టెండర్లు వేస్తున్నారు. వరుసగా స్థానిక సంస్థలు కార్పొరేషన్ తదితర ఎన్నికలు రానుండడంతో ఇతర రాష్ట్ర లతోపాటు రాజకీయ పార్టీల నేతలు రియల్ వేస్టేట్ వ్యాపారులు ఉద్యోగులు, సంఘాల నేతలు, సాఫ్ట్‌వేర్ తదితరులు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. శనివారం చివరి రోజు చివరి రోజు దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో రానుండడంతో అన్ని కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను ఆబ్కారీ అధికారులు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు..

మద్యం దుకాణాలు దక్కించుకోవడంలో ఇతర రాష్ట్రాల వారు పోటీ పడుతున్నారు. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున నగరానికి చేరుకొని దరఖాస్తులు చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం మహారాష్ట్రకు చెందినవారు 50కి పైగా దరఖాస్తులు చేశారు. వీరితోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గుంటూరు, చీరాల, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి

మిగతా 8వ పేజీలో...



సీఎంకు పూలమొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

విద్యా హబ్‌గా జిల్లా

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూరదృష్టి ఫలితం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిసిన మాజీ మంత్రి

నిజామాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేసి నిజామాబాద్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతున్న సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో సీఎం నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చినందుకు సీఎంకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల స్థాపనతో నిజామాబాద్‌లో విద్యారంగం కొత్త దశలోకి అడుగుపెడుతోందని అన్నారు. ఇప్పటికే మెడికల్, ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలతో ఉన్న విద్యా వాతావరణానికి ఈ వ్యవసాయ కళాశాల మరింత శోభ తెస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జిల్లా సమగ్రాభివృద్ధి దిశగా దూసుకుపోతోందని పేర్కొన్నారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తరఫున కూడా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరగాలి

- లోడింగ్, అన్ లోడింగ్‌లో జాప్యం లేకుండా చూడాలి
- జిల్లాలో 670 పైగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



చందూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

మోస్రా, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరగాలని, పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన మీదట వారికి రసీదులు అందించాలని సదరు రైతు వివరాలు క్రాప్ బుకింగ్ డేటాలో నమోదై ఉన్నాయా అని పరిశీలించుకోవాలని సూచించారు. మోస్రా, చందూర్, వర్ని మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఆయా కేంద్రాలలో ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, ఎన్ని లారీల లోడ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉంది తదితర విరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు, గ్రెయిన్ క్యాలీపర్లు, మాయిశ్చర్ మీటర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోడింగ్, అన్ లోడింగ్‌లో జాప్యం జరగకుండా సరిపడా హమాలీలను నియమించుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన మేర టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పంపాలన్నారు. లారీల కొరత తలెత్తకుండా ప్రణాళిబద్ధంగా చర్యలు

మిగతా 8వ పేజీలో...

ఇందూరుకు వ్యవసాయ కళాశాల.. నేతల హర్షం 7

కాంగ్రెస్ సేవాదారులకే ప్రాధాన్యం

- కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్
- కార్యకర్తలే జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవడం సంతోషకరం
- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి
- డిచ్‌పల్లి, ధర్పల్లిలలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్

ధర్పల్లి అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి కనీసం ఐదు సంవత్సరాలుగా సేవలందించిన, ప్రజలతో కలసి పనిచేసే కార్యకర్తకే జిల్లా అధ్యక్ష పదవి దక్కేలా చర్యలు తీసుకుంటామని ఏఐసీసీ పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్ అన్నారు. గ్రామాల వారీగా కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి ఏఐసీసీకి పంపిస్తామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికలో కార్యకర్తల అభిప్రాయ సేకరణలో భాగంగా శుక్రవారం డిచ్‌పల్లి, ధర్పల్లిల లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లలో నిర్వహించిన "సంఘటన్ శ్రీజన్ అభియాన్" సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో ఈ నియామక ప్రక్రియ జరుగుతోందన్నారు. బీజేపీ పాలనలో రైతులు, మైనార్టీలు నష్టపోయారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ విజయాన్ని సాధించాలి అని పిలుపునిచ్చారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విధానంలో కార్యకర్తల చేతనే జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోవడం ఎంతో సంతోషకరమని,

మిగతా 8వ పేజీలో...

క్రైం సమాచారం

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

పెద్దకొడప్గల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపూర్ చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కాస్లాబాద్ గ్రామానికి చెందిన పిసికె సాయిలు (50)కు భార్యతో విబేధాలు కావడం తో తన తమ్ముడు లింగయ్య వద్ద ఉంటున్నాడు. ఈనెల 15న కాస్లాబాద్‌లో తమ్ముడి ఇంటివద్ద భోజనం చేసిన సాయిలు సీతాఫలాల కోసమని ఇంటినుంచి బయల్దేరినట్లు లింగయ్య తెలిపారు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో లింగయ్యతోపాటు గ్రామస్థులు సాయిలు కోసం గాలించారు. శుక్రవారం ఉదయం బేగంపూర్ శివారులోని చెరువు వద్ద సాయిలు మృతదేహం ఉన్నట్లు గుర్తించిన బంధువులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. మృతుడు సాయిలుకు కళ్లు సరిగా కనిపించవని, చెరువులోకి దిగి మృతిచెంది ఉంటాడని లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి



మృతిచెందిన సయ్యద్ చోటు

నాగిరెడ్డిపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామశివారులో శుక్ర వారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్ వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా రామసముద్రం గ్రామానికి చెందిన సయ్యద్ చోటు (16) కొంతకాలం గ్రామస్థులతో కలిసి బాతులు మేపడానికి నాగిరెడ్డిపేట గ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం సయ్యద్ చోటు గ్రామ శివారులోని పోచారం కెనాల్ పక్కన బాతులను మేపడానికి వెళ్లాడు. బాతులు మండలంలోని కన్నెబాతులు పొలాల్లోకి వెళ్లగా వాటిని మళ్లించడానికి పొలంపైకి వెళ్లిన సయ్యద్ చోటు పొలంలో ఉన్న స్టార్టర్ బాక్సు వద్ద విద్యుత్ వైరుకు తగిలి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి ముంతాజ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

385 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మాక్లూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామ శివారులో గల రైస్‌మిల్లులో శుక్రవారం రాత్రి 385 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మామిడిపల్లి శివారులో గల వైభవ్ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు వచ్చి పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచి సిబ్బందితో అక్కడికి వెళ్లి తనిఖీలు చేశారు. ఐచర్‌వ్యాన్‌లో సుమారు 127 క్వింటాళ్ల బియ్యం, మిల్లులో సుమారు 257 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఐచర్ వ్యాన్ డ్రైవర్ మహ్మద్ సోహెల్, వాహనయజమాని, మదనం ఎల్లయ్య, రైస్‌మిల్లు యజమాని నల్లమాడు నరేష్, ఆనేరెడ్డి బాలాజీలపైన డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లయ్ ఆఫీస్, నిజామాబాద్ వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శక్కర్‌నగర్ సమీపంలో గల సాతేపుల్ వద్ద వేగంగా వస్తున్న కార్ స్కూటీని ఢీకొట్టింది. వద్ద తాగి ఉన్న భార్యభర్తలతో పాటు అక్కడే ఉన్న ఓ బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో ఆశాన్, శ్వేతలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గురువారం ఆర్థరాత్రి చోటు చేసుకుందని, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి జైలు

ఎల్లారెడ్డిరూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి సుష్మ ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. జైలు శిక్షతోపాటు రూ.1100 జరిమానా విధించినట్లు చెప్పారు.

గవాయ్‌పై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ధర్నా

నవీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయమూర్తిపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే కేసునమోదు చేసి అతనిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, కుమార్, గోపి, వెంకట్, కృష్ణ తదితరులున్నారు.

మెండోరా: సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాకురి మహేష్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి సోహన్ మాదిగ, నాయకులు దుమ్మడి సాయన్న మాదిగ, ముత్తెన్న, రాజన్న, తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



గొట్టుముక్కులలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాక్లూర్, అక్టోబ రు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటలను దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించుకోవాలని చైర్మన్ బూరోల్ల ఆశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టు ముక్కుల, ముల్లంగి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవిప్రకాష్, సంఘ కార్యదర్శి ప్రవీణ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

డొంకేశ్వర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాలయ శ్రీ రాజరాజేశ్వర స్వామి విగ్రహ, శిఖర, ప్రతిష్ఠాపన పూజా క్రతువులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన మూడు రోజులుగా వేద పండితులు విశేష హోమాలు ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న సంఘం సభ్యులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నందిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాలు మొక్కజొన్న ధాన్యానికి రూ2400 చెల్లిస్తామని ఖుద్వాన్‌పూర్ సొసైటీ చైర్మన్ వాకిడి కార్తీక్ రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖైంద్ల ప్రశాంత్ పేర్కొన్నారు. మొక్కజొన్న రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తోట మహేష్, సీఈవో చిన్నయ్య, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగ్గారయ్య తుక్కన్న, రైతులు, సొసైటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి

బోధన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని సంగెం, భవానీపేట్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, గన్నీబ్యాగులు, లారీలు, మాయిశ్చర్ మీటర్లు, వేయింగ్ మిషన్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతుల రికార్డుల నిర్వహణ ప్రతి రైతు యొక్క సీరియల్ నెంబర్‌ను రికార్డు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

ధాన్యాన్ని తూర్పార పట్టి తేమశాతం సరిచూసిన తర్వాత ప్రతీ రైతుకు తప్పనిసరిగా ట్రక్ షీట్‌ను తయారు చేయాలన్నారు. రైస్‌మిల్లులతో అనుసంధానం చేసి పంపిన వారికి సంబంధించిన రసీదులు పొందడానికి రైస్‌మిల్లులతో క్రమంతప్పకుండా ఫాలోఅప్ చేయాలన్నారు. డివిజన్‌లోని తహసీల్దార్లు సొసైటీ సీఈవోలతో సమన్వయం చేసుకుంటూ రోజువారి పీపీసీ వారీగా డేటా నిర్వహించాలని ఆదేశించారు.

నవీపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట: నవీపేట సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సొసైటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ కేరమావతి సొసైటీ కార్యదర్శి మహేష్, మోహ్రా సాయిరెడ్డి, ప్రసన్నకుమార్, సంజీవరెడ్డి, గణేష్, రాము, గంగాధర్ ఉన్నారు.

అనుమతి లేని ప్రార్థనా మందిరాన్ని తొలగించాలి

నవీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీ చౌక్ సమీపంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ప్రార్థన మందిరాన్ని తొలగించాలని కోరుతూ పలువురు కాలనీవాసులు, నాయకులు పోలీసులతో పాటు పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత ప్రార్థన మందిరం ఏర్పాటుతో తాము ఇబ్బందులు పడుతున్నామని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో పరశురాం గౌడ్, రాజేందర్ గౌడ్, గణేష్, రాము, కృష్ణ తదితరులున్నారు.

బోధన్-గాంధారి బస్సు నడపాలి

వర్ని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఆర్టీసీ డిపో నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి వరకు రాత్రి పూట బస్సును నడపాలని పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి కోరారు. శుక్రవారం బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఇదేమార్గంలో బడా పహాడ్ పుణ్యక్షేత్రం కలదని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు రాకపోకలు కొనసాగిస్తారని పేర్కొన్నారు. రాత్రివేళల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తుచేశారు. మార్గంలో ఎక్కువగా కామారెడ్డి, హైదరాబాద్ వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని గుర్తుచేశారు.

ముగ్గురు పిల్లలున్నా ఎన్నికల్లో పోటీకి అవకాశం హర్షణీయం

ఆర్మూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన తల్లిదండ్రులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం హర్షనీయమని పీసీసీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి అన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

నేటి బీసీ బంద్‌ను జయప్రదం చేస్తాం

» మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

వర్ని, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం తలపెట్టిన బీసీ బంద్‌ను జయప్రదం చేస్తామని బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. శుక్రవారం వర్నిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి 42శాతం రిజర్వేషన్ అమలు పేరుతో నాటకాలు ఆడి చివరకు బీసీ బిడ్డల గొంతు కోశారని ఆయన విమర్శించారు. హై కోర్టు, సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతరు చేసి జారీ 42శాతం రిజర్వేషన్ పేరుతో సీఎం జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ కోసం పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయాన్ని తిప్పికొట్టేలా బీసీ బంద్‌ని జయప్రదం చేస్తామని సీనియర్ నేత యలమంచిలి శ్రీనివాస్‌రావు తెల్పి చెప్పారు. సమావేశంలో వంగా శ్రీనివాస్ రావు, తెళ్ల రవికుమార్, గంగాప్ప మాధవ రెడ్డి, ఆసిఫ్, ఏజాజ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

బాజిరెడ్డి పరామర్శ

వర్ని: మండలంలోని తగిలేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి బక్క ఆనంద్ స్వరూప్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం తగిలేపల్లికి చేరుకున్నారు. మృతుడి తండ్రి బక్క బాన్సుర్‌ను పరామర్శించారు. బాజిరెడ్డి వెంట నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, బక్క నారాయణ, గుజ్జ అశోక్, చింతం రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ మద్దతు

పెర్కిట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంలో బీసీ సంఘాలు ఇచ్చిన నేటి బంద్‌కు ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యాలు ఆర్మూర్ మండల ట్రస్మా అధ్యక్ష కార్యదర్శులు భరత్‌చంద్ర మల్లయ్య, విద్యా ప్రవీణ్ పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, రాష్ట్ర ప్రతినిధి కాంతి గంగారెడ్డి, నలంద ప్రసాద్, సాగర్ తెలిపారు.

మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు

జక్రాన్‌పల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జరిగే రాష్ట్ర బంద్‌కు బీఆర్‌ఎస్ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ కుంచాల విమల రాజు, నాయకులు మాట్లాడారు. బంద్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా నేడు చేపట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులు సీపీఐఎంఎల్ ప్రజా పంథా పార్టీ, అధికార ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ డ్రామాలు ఆపి 9వ షెడ్యూల్‌లో చేర్చి 42 శాతం రిజర్వేషన్‌లతోను స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజా పంథా పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వి. ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఈశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్, సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి బి. దేవారాం నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఎడారిలో చిక్కుకున్న సిద్దపల్లి గ్రామవాసి

● సీఎం ప్రవాసి ప్రజావాణిని ఆశ్రయించిన కుటుంబ సభ్యులు

భీమ్‌గల్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జోర గ్రామ పంచాయతీ పరిధిలోని సిద్దపల్లి గ్రామానికి చెందిన భోజ సురేష్ అనే యువకుడు గల్ఫ్ ఏజెంట్ చేసిన మోసానికి మస్కట్ దేశంలో ఎడారిలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నాడు. భోజ సురేష్ ను రక్షించి ఇండియాకు తీసుకురావాలని అతని కుటుంబ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసి ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి పేరిట వినతి పత్రం సమర్పించారు. పూర్తి వివరాల ప్రకారం భోజ సురేందర్ 2025 సంవత్సరం ఆగస్టు 20న మస్కట్‌కు వెళ్లాడు. ఏజెంట్ ఇక్కడ కంపెనీ లో క్లీనర్ పని అని చెప్పి మస్కట్ ఎడారిలో గొర్రెల కాపరిగా పెట్టారని, దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాడు. ఒమాన్ రాజధాని మస్కట్ కు 250 కిలోమీటర్ల దూరంలోని యంకల్ అనే పట్టణంలోని ఎడారి ప్రాంతంలో గొర్రెలను మేపుతూ, విపరీతమైన ఎండ ఒత్తిడి, ఎడారి వాతావరణం తట్టుకోలేక పోతున్నానని సురేష్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. జీవితం సురేష్ తల్లి చనిపోయిన అంత్యక్రియలకు ఇండియాకు పంపమని బ్రతిమిలాడిన పంపించకపోగా ఇండియాకు రావాలంటే అనుమతి ఇవ్వలేదని, ప్రస్తుతం భార్య అనారోగ్యంతో బాధపడుతున్నదని తన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని ఎలాగైనా ఇండియాకు తిరిగి పంపాలని సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశాడు. సురేష్ ను ఇండియాకు రప్పించాలని వినతి పత్రం అందజేయగా ఇండియా ఎమిగ్రాంట్స్ వెల్ఫేర్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి బీఎల్ సురేంద్రనాథ్, ప్రజావాణి సిబ్బంది జగదీష్ పటేల్, టాంకాం ప్రతినిధి పవన్ కుమార్ సురేష్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు



మస్కట్ ఎడారిలో చిక్కుకున్న సురేష్

వరి కోతలో మెలకువలు పాటిస్తే నాణ్యత గల ధాన్యాన్ని పొందవచ్చు

జక్రాన్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వరి కోతలో నిర్దేశించిన పద్ధతులు పాటిస్తే నాణ్యత గల ధాన్యాన్ని పొందవచ్చని తహసీల్దార్ కిరణ్మయి, వ్యవసాయాధికారి దేవిక అన్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ మిషన్ యంత్రాలకులు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరి కోతలో అధికారులు నిర్దేశించిన పద్ధతుల పాటిస్తే తాలు, మట్టి పెల్లలు, గడ్డి రేకులు గ్రేడ్ 1 నాణ్యతగల ధాన్యాన్ని పొందవచ్చని స్పష్టం చేశారు. రైతులు వరి కోతకు వచ్చినప్పుడే కొయ్యాలని పచ్చగా ఉన్నప్పుడు కోయొద్దని వరి ఎండిపోయి కోతకు వచ్చినప్పుడే వరి కోతను కోయాలని రైతులకు సూచించారు. వరి పచ్చిగ ఉన్నప్పుడు కోతలు కోస్తే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. వరికోతలలో అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తే నాణ్యమైన ధాన్యం వస్తుందని దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈవోలు, వరికోత యంత్రాలు, ఏఈవోలు, జీపీవోలు, రైతులు పాల్గొన్నారు. నిర్వాహకులకు లారీల కొరత, గన్నీ బ్యాగుల కొరతలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు తమ పంటలను కేంద్రాలకు తరలించాలని మొక్కజొన్న తేమ శాతం14 కు మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వ ప్రకటించిన ధర క్వింటాలుకు 24వందలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సర్దయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, డైరెక్టర్ మహేందర్, ఏవో రమ్యశ్రీ, నాయకులు బుచ్చిమల్లయ్య, నిమ్మరాజేంద్ర ప్రసాద్, గణేష్ గౌడ్, కిషన్ గౌడ్, భరత రాజేష్, మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ, కార్యదర్శి శంకర్, సిబ్బంది రైతులు ఏఈవోలు పాల్గొన్నారు.

పంటను కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలి

● డీఎస్‌వో శ్రీనివాస్ రావు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) రైతుల సౌకర్యార్థం ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యంకొనుగోలు కేంద్రంలలో తమ పంటలను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని డిఎస్‌వో శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి సహకార సంఘ భవనంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాని ఆయన ప్రారంభించారు. కేంద్రానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాల్సిన బాధ్యత కేంద్రాల

స్వచ్ఛ తెలంగాణ ప్రతిజ్ఞ



పెర్కిట్ లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పెర్కిట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పక్షోత్సవాలలో శుక్రవారం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ తెలంగాణ ప్రతిజ్ఞ చేయించారు. పెర్కిట్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు

పెర్కిట్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో క్రీడలలో గెలుపొందిన జడ్పీహెచ్ఎస్ పెర్కిట్ తెలుగు మీడియం విద్యార్థులను విడిని సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజ గంగారాం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మున్నా పాల్గొన్నారు. మండల స్థాయిలో అండర్ -17 బాలుర కబడ్డీ పోటీలలో ద్వితీయ బహుమతి, మార్చ్‌ఫాస్ట్‌లో ప్రత్యేక బహుమతి, అండర్ -14 బాలుర కబడ్డీలో ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాణసంచాల దుకాణాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో తాత్కాలిక బాణసంచాల దుకాణాలు ఏర్పాటు కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్ తెలిపారు. గ్రామాలలో తాత్కాలిక బాణ సంచాల దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా నిజామాబాద్ డివిజన్‌లోని ఏసీపీ వద్ద అనుమతి తీసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ విద్యార్థిని ఎంపిక



ప్రణతి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -17 వాలీబాల్ పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ ప్రణతి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా తిమ్మాపూర్‌లో శనివారం నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో విద్యార్థిని ప్రణతి పాల్గొంటుందని తెలిపారు.

గుంతలను పూడ్చాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

నవీపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో పలుచోట్ల రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయని, వాటిని పూడ్చాలని గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. వీటిపై అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. గుంతలలో అధికారులు కంకర పౌడర్ వేయడంతో దుమ్ము, ధూళితో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ముఖానికి మాస్క్ ధరించి రాస్తారోకో చేశారు. బైంసా నుంచి నిజామాబాద్ వస్తున్న తహసీల్దార్ వెంకటరమణ రాస్తారోకో చేస్తున్నవారికి నచ్చ జెప్పి ఆందోళన విరమింపజేశారు. అనంతరం గ్రామస్థులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

పోతంగల్ పంచాయతీ కార్యదర్శిని తొలగించాలి

కోటగిరి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్‌ను విధుల నుంచి తొలగించాలని గ్రామస్థులు పోతంగల్ పంచాయతీ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. స్థానికులు మాట్లాడుతూ తాగునీటి, పారిశుధ్య సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. కార్యాలయానికి వెళ్తే డబ్బులు తీసుకోనిదే ఏ పని జరగదం లేదని ఆరోపించారు. పంచాయతీలో ఉన్నపాత వస్తువులను వేలం వేయకుండా, నోటీసులు ఇవ్వకుండా అమ్మేశారన్నారు. అనంతరం ఎంపీడీవో చందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు హన్మాండ్లు, శేఖర్, హైమద్, సాయిలు, గంగారాం, నవీన్, రాము, లక్ష్మణ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

బోధన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 108 సిబ్బంది విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది లక్ష్మణ్, కేప్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: కళ్ల ముందు అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చు అని డొంకేశ్వర్ మండల వైద్యాధికారి శుభాకర్ అన్నారు. డొంకేశ్వర మండలంలోని తొండాకూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేష్, వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి, నర్స్ వైజర్ సురేందర్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

నవీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరుతూ సీపీఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీసీలకు రిజర్వేషన్‌ల అమలు విషయంలో బీజేపీ ద్వంద వైఖరి సరికాదని అన్నారు. శనివారం జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

బోధన్: బీసీ రిజర్వేషన్ల పట్ల బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం కేంద్రప్రభుత్వానికి నిరసనగా ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, నన్నేసాబ్, గంగాధరప్ప, జంగం గంగాధర్, మల్లేష్, సాగర్ పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని బోధన్‌రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, పేకాట స్థావరం వద్ద రూ.4వేల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడిన, నిర్వహించిన చర్యలు తప్పవన్నారు.

ముప్కాల్ నూతన ఎంపీడీవోగా డి.రమేష్



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

ముప్కాల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల నూతన ఎంపీడీవోగా డి. రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన బాల గంగాధర్ బదిలీపై రుద్రూర్ వెళ్లగా ప్రస్తుతం రమేష్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన రమేష్‌ను కార్యాలయ సిబ్బంది కలువగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని తెలిపారు.


విద్యార్థులకు ఓపెన్ హౌజ్‌పై అవగాహన

ముప్కాల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముప్కాల్ పోలీస్ స్టేషన్ పోలీసుల బృందం ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం పోలీస్ బృందం వారు విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాల ఉపయోగం, లాకప్ గదులను, రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై రజనీకాంత్‌రెడ్డి, ఏఎస్సై గంగారాం అవగాహన కల్పించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నందిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో మూడు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సొసైటీ చైర్మన్ వాకిడి కార్తీక్ రెడ్డి ప్రారంభించారు. తొండాకూర్, దత్తాపూర్, ఖుద్వాన్‌పూర్ గ్రామాల్లో ఒక్కటి చొప్పున కేంద్రాలు మొదలైనాయి. ఈ సందర్భంగా చైర్మన్ వాకిడి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఏ గ్రేడ్(దొడ్డు రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2389, బి గ్రేడ్(సన్న రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,369 ధర ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కార్తీక్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆ ర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖైంద్ల ప్రశాంత్, సొసైటీ సీఈవో బల చిన్నయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

ఈవ్ టీజింగ్ సైబర్ క్రైమ్‌లపై అవగాహన



షీ టీమ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డొంకేశ్వర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల విద్యార్థుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచా రం అందించాలని ఏఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ క్రైమ్ షీ టీంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవ్ టీజింగ్‌కు గురైన వారు భయపడకుండా షీ టీంకు సమాచారం అందిస్తే వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఎవరైనా విద్యార్థులను మహిళలను వేధింపులకు గురి చేస్తే షీ టీంకు సమాచారం ఇస్తున్నట్లయితే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, కానిస్టేబుల్ విగ్నేష్, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లి పీహెచ్‌సీ తనిఖీ

కమ్మర్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్టోర్‌రూంలోని మందులను పరిశీలించి మందులవివరాలను, వాటి నిలువలను ఆడిట్ చేశారు.

ఇందూరుకు వ్యవసాయ కళాశాల.. నేతల హర్షం

నిజామాబాద్, సుభాష్‌నగర్, కమ్మర్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన వ్యవసాయ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదం తెలపడంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● కళాశాల మంజూరు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ చిత్రపటాలకు శుక్రవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు.

● వ్యవసాయ కళాశాల మంజూరైన నేపథ్యంలో టీయూ పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి సీఎం, జిల్లా నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరుపొందిన నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ కళాశాల వల్ల అనేక పరిశోధనలు జరిగి నూతన విప్లవానికి నాంది పలుకుతుందని అన్నారు. సతీష్, రమేష్, మీరాన్ అలీ, అయూబ్, విశాల్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాత్ర కీలకం



నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు విషయంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పాత్ర కీలకం. గతంలో మెడికల్ కళాశాల తీసుకొచ్చిన ఆయన, ఇటీవల ఇంజినీరింగ్ కళాశాల సైతం జిల్లాకు మంజూరయ్యేలా కృషిచేశారు.

● తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్

కళాశాల మంజూరు గొప్ప విషయం



జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరవడం గొప్ప విషయం. మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిల కృషి కూడా ఎంతో ఉంది.

● మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

యువతకు ఉపయుక్తం



నిజామాబాద్ వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఈ కళాశాల రైతు యువతకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ నిర్ణయం నిజామాబాద్ ప్రజల ఆశలను నెరవేర్చింది. అగ్రికల్చర్ కళాశాల కేటాయింపుతో రూరల్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

● భూపతిరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

గతంలో మంత్రికి విజ్ఞప్తి చేశా



గతంలో నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వ్యవసాయ కళాశాల మంజూరు కోసం విజ్ఞప్తి చేశా. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వ్యవసాయ కళాశాల మంజూరులో తమవంతు పాత్ర పోషించారని, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం సీఎంను కోరారని చెప్పారు. కళాశాల రాకతో రైతులకు ఎంతో ఉపయోగం.

● గడుగు గంగాధర్, రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి



లొంగన్‌లో ఇంటికి ముగ్గు పోస్తున్న అధికారులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లొంగన్ గ్రామంలో పలువురి ఇళ్ల నిర్మాణానికి ఆయన ముగ్గు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్లను ప్రభుత్వం సూచించిన విధంగా నిర్మించుకుంటే విడతల వారీగా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. దీంతో పాటుగా అదనంగా ఐకేపీ నుంచి వడ్డీ లేకుండా రూ.లక్ష రుణం ఇప్పిస్తామన్నారు. జుక్కల్ మండలంలో 617 ఇళ్లు మంజూరు కాగా, 295 ఇళ్లకు ముగ్గు వేశామని చెప్పారు. రెండు ఇళ్లు పూర్తి కాగా, 21 స్లాబ్ దశలో, 104 బేస్మిట్ దశలో, 58 పుట్టింగ్ దశలో, 32 ముగ్గు దశలో ఉన్నాయని తెలిపారు. 22 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. ఎంపీవో రాము, పంచాయితీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

గోదాం భవనం పూర్తి.. త్వరలో ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గోదాం భవనం

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం భవనం అందుబాటులోకి వచ్చింది. గ్రామంతో పాటు పరిసర గ్రామ రైతుల అవసరం నిమిత్తం సహకార అధికారులు రూ.20 లక్షల నిధులతో 2.50 మెట్రిక్ టన్ను సామర్థ్యం గల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. భవనం అందుబాటులోకి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జుక్కల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్

బాన్సువాడటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గంలోని పలువురు బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న దొన్కంటి ప్రవీణ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఈ మేరకు ప్రవీణ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పాతబాన్సువాడకు చెందిన వీరారెడ్డి గత కొన్ని రోజుల క్రితం ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకోగా, విషయం తెలుసుకున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఖయ్యూం ప్రమాదవశాత్తు గాయపడటంతో ఆయన ఇంటికెళ్లి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి



డ్వాక్రా సంఘాల అధ్యక్షులతో మాట్లాడుతున్న ఏపీఎం గంగారం

జుక్కల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలాస్, కండెవల్లూరు గ్రామాల్లో త్వరలో ఏర్పాటుకానున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఏపీఎం గంగారం అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తేమశాతం చూసుకొని, కాంటాలు చేసుకోవాలన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడవసతి, టెంట్లు ఏర్పాటుచేయాలన్నారు. అధ్యక్షులు, కార్యదర్శులు అంబవ లక్ష్మి, సీసీలు అకౌంటెంట్ స్వరూప, సంఘ సభ్యురాలు మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సకాలంలో అందాలి

ఆర్మూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు సరైన సమయంలో అందాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైతువేదికలో శుక్రవారం 224 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు ఆర్మూర్ మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. ఇరిగేషన్ భూముల వద్ద కట్టడాలను ఆపివేయాలని భూమి కబ్జా కాకుండా చూడాలని అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్

బాన్సువాడటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం నిర్వహించబోయే బంద్‌కు అందరూ సహకరించాలని ఆయన కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గంగాధర్, రాజులు, జీవన్, బాలకృష్ణ, లింగం, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు కపాస్ యాప్‌పై అవగాహన

మద్నూర్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఎక్లారా గ్రామానికి చెందిన పత్తి రైతులకు కిసాన్ కపాస్ యాప్‌పై మండల వ్యవసాయ అధికారి రాజు శుక్రవారం అవగాహన కల్పించారు. వానకాలంలో సాగు చేసిన పత్తి పంటకు సంబంధించిన వివరాలను తప్పకుండా ఏఈవో వద్ద నమోదు చేయించాలని సూచించారు. పంట వివరాలు రాయించుకోని రైతులుంటే తమ పరిధిలోని ఏఈవోల వద్ద సరిచూసుకొని నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్ కూడా సరి చూసుకోవాలన్నారు. పత్తి కొనుగోలు కొరకు ఈసారి సీసీఐ వారు పత్తి రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్‌బుక్ చేసుకొని నిర్ణయించబడిన తేదీకి మాత్రమే మార్కెట్‌కి రావాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్‌ను రైతులు ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఏఈఓ సంపత్, రైతులు పాల్గొన్నారు.



మద్నూర్ మండలంలో రైతులకు కాపాస్ యాప్ పై అవగాహన కల్పిస్తున్న ఏవో

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రామకృష్ణపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రేమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి ప ద్మారావు, నాయకులు కామేలు, బాలయ్య, శం కర్, పోచయ్య, సాయిబాబు, కాశీరాం, యాద గిరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

మద్నూర్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్‌సీడీసీఎల్ అధికారులు ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని సీజీఆర్ఎఫ్-2 చైర్మన్ ఎరుకల నారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని మేనూర్‌లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఈ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాల వినియోగదారులు పాల్గొన్నారు.

పంట సిద్ధమైనా.. తప్పని నిరీక్షణ

జుక్కల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని వివిధ గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన సోయాపంటను విక్రయించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. ఏటా రాష్ట్ర మార్క్‌ఫెడ్ అధికారులు సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ మార్కెట్లో విక్రయిద్దామంటే క్వింటాల్‌కు రూ.4300 ధర మాత్రమే పలుకుతోంది. మరోవైపు ప్రభుత్వము నిర్ణయించిన ధర మాత్రం రూ.5300గా ఉంది. దీంతో ప్రైవేట్‌లో విక్రయిస్తే నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన సోయా పంట

బంద్‌కు సహకరించాలి

బాన్సువాడటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం శనివారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీసీ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తూ వ్యాపార సముదాయాలను మూసిఉంచాలన్నారు. పాఠశాలలు , కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు.

ముందస్తు దీపావళి సంబరాలు

బాన్సువాడటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం టపాసులు కాలుస్తూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.



సంబరాలు జరుపుకొంటున్న దృశ్యం



ఖేలో ఉత్సవ్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

భాగ్యనగరంలో సత్తాచాటిన బిచ్కుంద విద్యార్థులు

బిచ్కుంద , అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని రిఫుల్స్ పాఠశాల విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఖేలో ఉత్సవ్‌లో ప్రీమియర్ లీగ్‌లో సత్తా చాటారు. ఖో-ఖో, రన్నింగ్, త్రోబాల్, చదరంగం వంటి క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు గోల్డ్‌మెడల్, సిల్వర్‌మెడల్, బ్రాంజ్ మెడల్‌లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ బస్వరాజ్‌పటేల్‌ను, ప్రధానోపాధ్యాయుడు గోపిని, విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ పాటిల్, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

వరి పంటలో క్షేత్రదినోత్సవం

మోర్తాడ్ , అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ వారు వరి పంటలో క్షేత్రదినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. నాణ్యమైన విత్తనం ప్రతి గ్రామానికి అనే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త పి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఆర్‌డీఆర్ 1200 అనే వరి రకాన్ని జిల్లాలోని అభ్యుదయ రైతులకు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉన్నందున ఈ క్షేత్ర దినోత్సవాన్ని జరుపుతున్నామని అన్నారు. ఈ రకం వరి అధిక దిగుబడి ఇస్తుందని పురుగులు, తెగుళ్లను పట్టుకుంటుందని అన్నారు. రైతులకు యాసంగిలో అనువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ కృషిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ పాటు మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, రైతులు మహిపాల్, లక్ష్మీనర్సయ్య, జైడి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఐరాడ్, ఈడార్‌లతో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలకు కృషి చేస్తున్నామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఈ ప్రాజెక్టులో పోలీస్, రవాణా, రహదారుల శాఖ, ఆరోగ్యశాఖల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు నిజామా బాద్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో ప్రవేశపెట్టిన నిజామాబాద్ జిల్లా ప్రగతిపథం లో దూసుకెళ్తుందన్నారు. తెలంగాణలో ప్రథ మంగా మార్చి 23 నాటికి ప్రతి విభాగాన్ని ఈ ప్రాజెక్టుకు అనుసంధానం చేసిందన్నారు. ఐరాడ్, ఈడార్‌ల అప్లికేషన్ ఉపయోగించి అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. తెలంగాణలో మొదటిసారిగా జిల్లాలో 50 కంటే ఎక్కువ ప్రమాద స్థలాలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేయడం జరిగిందన్నారు. 200 కన్న ఎక్కువ రోడ్డు ప్రమాదాల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ జిల్లాను మోడల్ జిల్లాగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రస్థాయిలో పోలీస్, రవాణా శాఖ విభాగాల అధికారులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

టపాకాయల దుకాణాల్లో తనిఖీలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 17, (ఆంధ్రజ్యో తి): టపాకాయల దుకాణాలను అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ శుక్రవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో 'నిబంధనలు తుస్' అనే కథనంపై మున్సిప ల్ అధికారులు స్పందించారు. గంజ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. టపాకా యల దుకాణాల్లో వివరాలు అడిగి తెలుసు కున్నారు. ట్రేడ్ లైసెన్సులు ఉన్నా యా లేదా అంటూ వాకబు చేశారు. ట్రేడ్ లైసె న్సులు లేకుంటే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. జనావాస ప్రాంతాల్లో దుకా ణాలు ఉండరాదని దూర ప్రాంతాలక తర లించాలని షాప్ యజమానులకు చెప్పారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

మరుగుదొడ్లు లేవు.. తాగునీరు రాదు

- కండేవల్లూర్ పాఠశాలలో విద్యార్థుల అవస్థలు
- ఆగిపోయిన అదనపు తరగతుల నిర్మాణాలు

జుక్కల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండేవల్లూర్ గ్రామంలోని జడ్పీ పాఠశాలను సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా బాలికలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేదని విద్యార్థులు వాపోతున్నారు. హైస్కూల్ ఆవరణ లోనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నప్పటికీ విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో అవస్థలు తప్పట్లేదు. మధ్యాహ్న భోజనం చేసే సమయంలో విద్యార్థులు ఇంటి నుంచే తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శౌచాలయాలు లేకపోవడంతో బాలికలు ఇంటికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి దుస్థితి. భోజనం వంట చేసే వాళ్లకు ప్రత్యేక గది సైతం ఆరుబయటనే వంట చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదులు నిర్మాణ దశలో ఉండగానే పనులు ఆగిపోయాయి. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో తరగతి గదుల్లో ఇరుగ్గా కూర్చొని చదువుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పం దించి పాఠశాలలో వసతులు ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు అధికారులను కోరారు.



కండెవల్లూర్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్

అవగాహన కల్పిస్తూ.. పాఠశాలలో నరకాసుర దహనం



జంక్‌ఫుడ్‌తో తయారుచేసిన నరకాసుర దహన కార్యక్రమ దృశ్యం

బాన్సువాడటౌన్ , అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ శుక్రవారం ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఉపాధ్యాయులు జంక్‌ఫుడ్ నరకాసుర బొమ్మను దహనం చేశారు. ప్రధానోపాధ్యాయులు లావణ్య, నరేశ్, టీచర్స్ ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మోపాల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మోపాల్ తహసీల్దార్ రేఖ అన్నారు. శుక్రవారం మండలంలోని మంచిప్ప గ్రామంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకొని మోసపోకుండా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వీవో ప్రతినిధులు, గ్రామ వీడీసీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

'బడుల తనిఖీలకు ఉపాధ్యాయులను పంపొద్దు'

ఇందూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బడుల తనిఖీలకు ఉపాధ్యాయులను నియమించొద్దని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులతో కలిసి కమిటీలు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్రప్రభుత్వం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు జిల్లా ఉపవిద్యాధికారుల పోస్టులను భర్తీచేసి వారి ద్వారా పాఠశాల పర్యవేక్షణ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ద్వారా తనిఖీలు చేయడంతో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందని అన్నారు. పాఠశాలల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు 8నెలల నుంచి వేతనాలు రావడం లేదని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన 5డీఏలను వెంటనే విడుదల చేయాలని, ప్రతీనెల ఇచ్చే రూ.700 కోట్లకు గండిపెట్టడం పట్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శిఅర్వింద్, జిల్లానాయకులు గోపి, నరేందర్ పేర్కొన్నారు.

విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ

మోపాల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు సోహం అకాడమి ఆఫ్ హ్యూమెన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్ ఇన్ అకాడమి కార్యక్రమం ద్వారా విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం గ్రామంలో విద్యార్థులకు రోబోటిక్‌పై శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 12 పాఠశాలల్లో రోబోటిక్ వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయన్నారు. గుండారం పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా ఈ శిక్షణలో పాల్గొన్నారని అన్నారు. ఈ శిక్షణలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, రోబోటిక్ కిట్‌లను అందజేశారు. భవిష్యత్తులో ఈ కిట్‌లు వారి ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచి నూతన ప్రాజెక్టులు రూపొందించేందుకు తోడ్పడుతాయని అన్నారు. సోహం సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్, బెస్ట్ అవలెబుల్ స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత మూడేళ్లుగా బకాయి పడ్డ ఫీజులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యామంత్రి లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు దీపిక, విఘ్నేష్, నాగేంద్ర, విశాల్, సుజిత్, గోవింద్, మనోజ్, మేఘన, ఆనంద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాజీనగర్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మరోవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనలో దాసరి కిషన్ గత రెండు రోజుల క్రితమే మరణించగా, శుక్రవారం చికిత్స పొందుతూ దాసరి వంశీ (30) మరణించాడు. నాగమణి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు రెండవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు ఏసీపీ మస్తాన్ అలీ చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. జిల్లాకేంద్రంలోని ఆర్ఎం కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిజామాబాద్ రీజియన్, రంగారెడ్డి రీజియన్‌లోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మస్తాన్ అలీ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ భద్రత సౌకర్యాల పరిరక్షణ లో ముందంజలో ఉందని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం జ్యోత్స్న, డీవీఎం మధుసూదన్, పీవో పద్మజ, ఏవో పరమాత్మ, సూపరింటెండెంట్ ఆనంద్, నిజామాబాద్ డిపో మేనేజర్ సంపూర్ణ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను చూపిస్తున్న దృశ్యం

బీసీ బంద్‌కు అన్నిపార్టీల మద్దతు

సుభాష్‌నగర్/ఇందూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ తెలంగాణ బంద్‌కు అన్నిపార్టీలు మద్దతు ప్రకటించాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో జారీ చేయగా హైకోర్టు స్టే నేపథ్యంలో బీసీ సంఘాలు శనివారం రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా బీసీ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, సంపూర్ణ మద్దతు తెలిపాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సహా కులసంఘాలు, ఉద్యోగ సంఘాలు, పాఠశాలలు మద్దతు తెలిపాయి.

బీఆర్ఎస్ మద్దతు..

బీఆర్ఎస్ పూర్తిమద్దతు ప్రకటిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుజిత్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడా సమావేశంలో బీఆర్ఎస్ బీసీ నాయకులు సత్యప్రకాశ్, చింతకాయల రాజు, మాకురవి, సురేష్, కాశీచరణ్, తదితరులున్నారు.

విద్యాసంస్థల బంద్‌కు పీడీఎస్‌యూ పిలుపు

42శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరిగే రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

బీసీ రిజర్వేషన్‌ను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల బీఎల్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అనంతరం బంద్‌కు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలత, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సంజయ్, తదితరులున్నారు.



టీఎన్‌జీవోస్ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

టీఎన్‌జీవో, టీజీవోలకు బీసీ సంఘాల వినతులు

బీసీ రాష్ట్రబంద్‌కు మద్దతు తెలపాలని టీజీవో అధ్యక్షుడు అలుక కిషన్, టీఎన్‌జీవో అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్‌కు బీసీ సంఘం నాయకులు వినతిపత్రాలను అందజేశారు. శుక్రవారం కార్యాలయాల్లో కలిసి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆంజనేయులు,దేవేందర్, గంగాకిషన్, తదితరులున్నారు.

ఆటో యూనియన్ జేఏసీ మద్దతు

రాష్ట్రబంద్‌కు ఆటో యూనియన్ జేఏసీ మద్దతు తెలిపింది. శనివారం తలపెట్టిన బంద్‌కు సహకరిస్తామని ఆటో యూనియన్ సంఘాల జేఏసీ కమిటీ సభ్యులను కలిసి బీసీ సంక్షేమ సంఘం నాయకులు సహకారం అందించాలని కోరడంతో యూనియన్ జేఏసీ నాయకులు సహకరిస్తామని తెలిపారు. న్యాయపోరాటంలో ఆటో యూనియన్ జేఏసీ మద్దతు ఉంటుందని యూనియన్ నాయకులు తెలిపారు.

ట్రస్మా మద్దతు

బీసీ బంద్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. శనివారం నిర్వహించే బంద్‌లో ప్రైవేటు పాఠశాలలన్నీ పాల్గొని మద్దతు తెలపాలని రాష్ట్ర కోశాధికారి జయసింహా గౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిత్యానందం, అరుణ్ తెలిపారు.

బంద్‌కు మాదిగ జేఏసీ మద్దతు

బీసీ బంద్‌కు మాదిగ జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బర్కుంటశ్రీనివాస్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు విజయ్‌కుమార్, గంగాధర్, శంకర్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

మోపాల్: బీసీ రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీసీ బంద్‌కు బీజేపీ మద్దతు

ఇందూరు: బీసీ బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బీజేపీపై బురదచల్లే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బీసీ బంద్‌కు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్న బీసీ బంద్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీసీ బంద్‌లో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీ బంద్‌కు టీడీపీ మద్దతు

బీసీ రిజర్వేషన్లకు బంద్‌కు టీడీపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బంద్‌లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సిరికొండ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారి నర్సయ్య, ఐకేపీ ఏపీఎం సువర్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయన్న, ఆసీఫ్, శోభన్, డైరెక్టర్‌లు లింగం, వీడీసీ అధ్యక్షుడు స్వామి, సభ్యులు, గ్రామ సమాఖ్య సభ్యులు, సీసీలు రాజేందర్, సత్యానంద్, పుష్ప తదితరులున్నారు.

అరెస్టు అమానుషం: చేతివృత్తిదారుల సంఘం

నిజామాబాద్‌కల్చరల్,అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): చలో రాజ్‌భవన్‌కు వెళ్తున్న చేతివృత్తిదారుల సంఘం నాయకులను అరెస్టు చేయడం అమానుషమని చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లాకన్వీనర్ పెద్దివెంకట్రాములు అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులవృత్తులు చేసుకుంటూ రిజర్వేషన్ కోసం పోరాడే నాయకులపై అక్రమ అరెస్టులు ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిలు, కల్లు గీతాకార్మిక సంఘ జిల్లా నాయకులు నర్సింహులు, కార్మిక సంఘ నాయకులు శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ నాయకులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిరికొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల పోటీలకు సిరికొండ మోడల్ స్కూల్ విద్యార్థిని స్వేత ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ గడ్డం రాజేష్‌రెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 20 వరకు జరిగే 19వ రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు సిరికొండకు చెందిన వోల్క స్వేత ఎంపికయ్యారని చెపుటకు సంతోషంగా ఉందని ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన ఎంపిక పోటీలలో స్వేత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించినందున రాష్ట్ర క్రీడల పోటీలకు సెలెక్టర్లు ఎంపిక చేశారని తెలిపారు.



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వెయ్యి పడకలు పెంచి సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందిని పెంచకపోవడంతో కార్మికులపై భారం పెరుగుతుందని అన్నారు. దీపావళి పండుగైన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాన్ని చెల్లించడం లేదని, వెంటనే పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో స్వరూప, భారతి, సాయికిరణ్, వెంకట్, సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ పాఠశాలకు టీవీల వితరణ

సిరికొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సిరికొండ మాజీ సర్పంచ్ దువ్వూరి నర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంజీవ్‌రెడ్డి రూ.80వేల విలువ గల రెండు టీవీలను బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్ తెలిపారు. 6, 7 తరగతుల విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన చేయడం కోసం అడిగిన వెంటనే సంజీవ్‌రెడ్డి 65 అంగుళాల టీవీలను అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల కోసం టాయిలెట్ నిర్మాణానికి సైతం సంజీవ్‌రెడ్డి ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. సంజీవ్‌రెడ్డికి విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలుపుతునట్లు సతీష్‌కుమార్ తెలిపారు.

బాటిల్ బరి..

(5వ పేజీ తరువాయి)

ప్రముఖ హోటలలో ఉంటూ రోజు వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తూ తక్కువ వచ్చే మద్యం షాపులకు దరఖాస్తులు చేస్తున్నారు.. గతంలో కూడా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి దరఖాస్తుల నమోదు చేసిన ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి దరఖాస్తులు నమోదు చేస్తున్నారు.

ఒకేరోజు 900లకు పైగా దరఖాస్తులు

శుక్రవారం ఒకేరోజు 900లకు పైగా దరఖాస్తులు నమోదయ్యాయి. గురువారం నాటికి 687 దరఖాస్తులు నమోదు కాగా శుక్రవారం 1500లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. చివరి రోజు మరో 1500లకు పైగా దరఖాస్తులు నమోదు అయ్యే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే తక్కువ అయిన 3లక్షల దరఖాస్తు ఫీజు ఉండటంతో ఈ మాత్రం దరఖాస్తులు రావడం అధికారుల్లో ఆనందం నెలకొంది. అత్యధికంగా నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 500లకు పైగా దరఖాస్తులు నమోదు అయ్యాయి. భీంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అత్యల్పంగా 170కి పైగా దరఖాస్తులు నమోదు అయ్యాయి. చివరి రోజు ఏ మద్యం దుకాణానికి తక్కువగా వస్తే ఆ మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

యువత ఆసక్తి..

ఐటీ సెక్టర్లు జీతాలు ఎక్కువగా ఉండటంతో తమ లక్కును పరీక్షించేందుకు ఈసారి మద్యం దుకాణాల్లో తమ లక్కును పరీక్షించుకుంటున్నారు.. నలుగురు ఐదుగురు సిండికేట్ గా మారి ఐదు నుంచి 10 షాపులకు దరఖాస్తులు నమోదు చేశారు. వీరితోపాటు ఎన్నారైలు సైతం దరఖాస్తు నమోదు ప్రక్రియలు నేరుగా కాకుండా పరోక్షంగా పాల్గొంటున్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు సైతం మద్యం టెండర్ల దరఖాస్తులలో పాల్గొంటున్నారు. మద్యం దుకాణాల కోసం మహిళలు సైతం దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. దరఖాసుదారులు తమ లక్కును పరీక్షించేందుకు తమ ఇంటి మహాలక్ష్మి ద్వారా దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే మహిళల పేరు మీద దరఖాస్తులు ఎక్కువగానే నమోదయ్యాయి.. కార్యాలయాలకు మహిళలను తీసుకువచ్చి దరఖాస్తులను నమోదు చేస్తున్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరగాలి

(5వ పేజీ తరువాయి)

తీసుకోవడం జరిగిందని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల ఆవరణలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. బాగా ఆరబెట్టి శుభ్రపరిచిన ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చి పూర్తిస్థాయి మద్దతు ధర పొందాలని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ కోసం ఈసారిజిల్లాలో 670 పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 300వరకు కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని కలెక్టర్ వెల్లడించారు. వరి కోతలు పూర్తయ్యి ధాన్యం దిగుబడులు రావడం ప్రారంభం అవుతున్న విధంగా ఆయా ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ధాన్యం సేకరణలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు తెచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నట్లయితే వెంటనే తూకం జరిపి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపడం జరుగుతుందని అన్నారు. మొక్కజొన్న పంట సాగు చేసిన ప్రాంతాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, సహకార శాఖ అధికారి అంబర్‌సింగ్, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్, స్థానికఅధికారులు, తహసీల్దార్ రాజశేఖర్, వీర్‌సింగ్, ఎంపీడీవో శ్రీనివాస్, చందూర్ ఎంపీడీవో నీలావతి, ఏఈఓ సప్తగిరి ఉన్నారు.

కాంగ్రెస్ సేవాదారులకే ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

ఇతర పార్టీల్లోలాగా పై అధికారుల నిర్ణయం కాదు, కార్యకర్తలే తామే నాయకుడిని ఎన్నుకోవడం కాంగ్రెస్ ప్రత్యేకత అని అన్నారు. అదే విధంగా, నిజామాబాద్ జిల్లాకు అగ్రికల్చర్ కళాశాల కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ కట్టుబడి ఉంది. కానీ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయి. బీసీ సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని భూపతి రెడ్డి తెలిపారు. అలాగే త్వరలో నిజామాబాద్ జిల్లాకు వెటర్నరీ కాలేజ్ కూడా కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరనని చెప్పారు. సమావేశంలో పార్లమెంటరీ అబ్జర్వర్ బల్మూరి వెంకట్, మాజీ మేయర్ పరిజతం రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, నగేష్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో 26 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)

జమ అవుతాయని డీఎస్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట ముత్తెన్న, డైరెక్టర్లు మహిపాల్, నవీద్, స్థానిక నాయకులు గిర్మాజి గోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పుప్పాల అశోక్, శ్రీధర్, జైడి గంగారాం, సొసైటీ కార్యదర్శి కాశీరాం, రైతులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, పాలెంలో..

మండలంలోని తిమ్మాపూర్, పాలెం గ్రామాలలో శుక్రవారం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీలు తడకల శ్రీనివాస్, మహేందర్, గడ్డం సంతోష్ కుమార్, మాజీ సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, రాష్ట్ర విత్తన సంస్థ డైరెక్టర్ రొక్కం మురళి, రైతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ అర్వింద్ కోరారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ అర్వింద్ ఆధ్వర్యంలో వాకర్లకు శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. వాకర్స్ అందరికి సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పురుషోత్తం, విజయ్, ఉమాప్రసాద్, భాస్కర్, వెంకటేష్, శ్రీను, ఉదయ్, తదితరులు ఉన్నారు.

సిరికొండ: సీపీఆర్ విధానంపై వైద్యబృందం ప్రజలకు అవగాహన కల్పించింది. సిరికొండ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది గుండె నొప్పి వస్తే అత్యవసరంగా సీపీఆర్ చేయాల్సిన విధానం గురించి ప్రదర్శించి చూపించారు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ శేఖర్‌గౌడ్, పైలట్ సుధాకర్ ప్రజలకు సీపీఆర్ గురించి వివరించారు.



సీపీఆర్ చేస్తున్న డాక్టర్ అర్వింద్



సిరికొండలో అవగాహన కల్పిస్తున్న వైద్యబృందం